క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మించాలి

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసే సీసీ రోడ్ల నిర్మాణాలు శంకుస్థాపనకే పరిమితం అయ్యింది. కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఈ ఏడాది ఫిబ్రవరి 13న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ భూమి చేశారు. కాని నెలలు గడుస్తున్నా నేటి వరకు పనులు ప్రారంభించలేదని కాలనీ వాసులు వాపోయారు. ఇప్పటికైన ఎమ్మెల్యే స్పందించి రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో కాటిక మానిషాకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.24వేలు మంజూరయ్యాయి. ఆదివారం బాధిత కుటుంబానికి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు లక్ష్మారెడ్డి, జంగయ్య, విజేందర్, రమేష్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో బస్‌షెల్టర్ నిర్మాణం

తాడూరు: మండలంలోని ఎటిదారిపల్లిలో గ్రామానికి చెందిన రమేష్ గౌడ్ స్వంత డబ్బుతో గ్రామంలో నూతనంగా బస్‌షెల్టర్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు సాయం అందించానని పేర్కొన్నారు. అనంతరం బస్‌షెల్టర్‌ను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరు సేవ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం రమేష్‌గౌడ్‌ను గ్రామస్తులు అభినందించారు.

దేవాలయ పునర్నిర్మాణానికి విరాళాలు

చారకొండ: మండలంలోని జేపల్లిలో రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ కోసం గ్రామానికి చెందిన దోస్తు ఫౌండేషన్ చైర్మన్ రమేష్ రూ. 50,116, గ్రామానికి చెందిన వెంకటయ్య రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆదివారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం దాతలను సన్మానించారు. దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు ఉన్నారు.

ఉద్యోగ సంఘాల నాయకుల హర్షం

అచ్చంపేట: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్‌టైమ్, అవుట్‌సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం సుముఖం తెలపడంతో ఆదివారం ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి గురుకుల పాఠశాల ఉద్యోగు సంఘం చేసిన ప్రయత్నాల వల్లే న్యాయం జరిగిందని తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో టీఎస్‌డబ్ల్యూ ఆర్‌టీయూ సంఘం నాయకులు బాలస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కీర్తి రవి, రాష్ట్ర ఉప అధ్యక్షుడు కె. పాండు నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగ శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి బి వెంకటేశ్వర్లు, పరమేశ్వరులు ఉన్నారు.

జ్ఞాన జ్యోతులు వెలిగిద్దాం

అచ్చంపేట రూరల్: దీపావళికి జ్ఞాన జ్యోతులు వెలిగిద్దామని త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూలు, అచ్చంపేట కమిటీ అధ్యక్షుడు మనోహర్, సాయి శంకర్ కోరారు. ఆదివారం పట్టణంలోని శివసాయినగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువు తన జ్ఞానాగ్నితో శిష్యులను యోగా మార్గంలో నడిపిస్తాడన్నారు. దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలన్నారు. శరీరం బయట విశ్వాన్ని నడిపే పరమాత్మ శక్తి ఉందని దీనికి గుర్తింపుగా ఇంటి బయట దీపావళి రోజు దీపాలు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో నరసింహ, శంకర్, రమాదేవి, పార్వతమ్మ, స్వప్న పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం



కల్వకుర్తిరూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుతామని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచందర్ అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. దేశంలో కుల వివక్ష, అసమానతలను రూపుమాపాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని రాంచందర్ కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రవి, బాలు, నర్సింహ, ప్రవీన్, మహేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



అవుసలికుంట శివారులో మృతిచెందిన కాడెద్దు



లింగాల ఎస్టీ హాస్టల్ పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

లింగాల: మండలంలోని పలు గ్రామాల శివారులో ఉన్న వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మూగజీవాలకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. పశువుల యజమానులు, రైతులు కాడెద్దులు, గేదెలు, మేకలు మొదలైన మూగ జీవాలను మేత కోసం అడవికి లేదా పంట పొలాల సమీపంలోకి తీసుకెళ్తున్నారే తప్పా అక్కడక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గమనించక పోవడంతో సమస్యగా మారుతుంది. మూగజీవాలు మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర మృత్యువాత పడుతున్నాయి. విద్యుదాఘాతంతో మృత్యువాత పడుతున్న మూగ జీవాలకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం కూడా అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఇటీవల రెండు రోజుల వ్యవధిలో సంఘటనలో రెండు ఎద్దులు మృత్యువాతకు గురయ్యాయి.

నాలుగు వేలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు

మండలంలోని లింగాల, మగ్దూంపూర్, అంబట్‌పల్లిలో మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో దాదాపుగా 4,500 వరకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. కొద్ది మంది రైతులు మాత్రమే కంచెలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి వర్షాకాలంలో పదుల సంఖ్యలో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి.

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి



వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేయాలి. కనెక్షన్లు తీసుకునే సమయంలో సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన వెంటనే అధికారులు కంచెను కూడా ఏర్పాటు చేయించి కనెక్షన్లు ఇవ్వాలి.

– వెంకటస్వామి, రైతు అంబట్‌పల్లి

రైతులే కంచె ఏర్పాటు చేసుకోవాలి



వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం చేయించుకునే బాధ్యత రైతులదే. విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం ఉండదు. మూగ జీవాలు మృత్యువాత పడకుండ కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలి. తమ శాఖ నిర్లక్ష్యం వలన చనిపోతే నష్ట పరిహారం అందిస్తాం.

– అప్పలనాయుడు, ట్రాన్స్‌కో ఏఈ, లింగాల

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

బల్మూర్: మండల కేంద్రంలో రోజు రోజుకు కుక్కల బెడద అధికమవుతోంది. ప్రధాన రహదారితో పాటు వీధులలో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇంటినుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. వాహనదారులు వెంట బడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. స్థానిక బస్టాండ్, నమాజ్‌గడ్డ, గ్రామ పంచాయతీ ప్రాంతాల్లోని రోడ్లపై కుక్కలు నిత్యం గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనదారులు వెంట పడుతుండటంతో తప్పించుకోలేక కింద పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల లింగాల వైపు వెళ్తున్న ఓ వాహన చోదకుని వెంట కుక్కల గుంపు పండటంతో బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నారులు ఒంటరిగా కనిపిస్తే వారిపై కూడా కుక్కలు దాడులు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ వారు స్పందించి గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బస్టాండ్ వద్ద గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

భగవద్గీత పఠనంతో వ్యక్తిత్వ వికాసం

కందనూలు: భగవద్గీత పఠనంతో వ్యక్తిత్వ వికాసం వృద్ధి చెందుతుందని భగవద్గీత పారాయణ కమిటీ అధ్యక్షుడు వెంకటశెట్టి, కార్యదర్శి బాదం చంద్రమౌళి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న శివాలయంలో భగవద్గీత సామూహిక పారాయణం పఠనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వాపర యుగంలో కురుక్షేత్ర సంగమంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశ ఫలితమే భగవద్గీత సృష్టి అని అన్నారు. మానవుని కర్మ, జ్ఞాన, వికాస, భక్తి, వికాసం లక్షణాలు యువత వ్యక్తిత్వ వికాసానికి గీతోపదేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వ్యక్తిత్వ వికాసంతో పాటు మానవత విలువలు సామాజిక స్పృహ ఎంతగానో అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో రఘునందన్ గౌడ్, రామ్మోహన్ వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు, విజయ్ కుమార్, బాలస్వామి, గోపాలకృష్ణ, బాలరాజ్ ప్రతాపరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



భగవద్గీత పారాయణం చేస్తున్న కమిటీ సభ్యులు

మాజీ సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మాజీ సీఎం నారాయణస్వామిని కలిసిన తిమ్మాజిపేట కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజిపేట: డీసీసీ ఎన్నిక విషయంలో కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకునేందుకు నాగర్‌కర్నూల్ పట్టణానికి విచ్చేసిన పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామిని మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. రాష్ట్ర టెలికాంబోర్డు సభ్యుడు శ్రీనివాస్‌బహదూర్, గొరిట సీనియర్ నాయకుడు దామోదర్ రెడ్డి, మారేపల్లికి చెందిన దోమ వెంకటేష్, శ్రీను, మరికల్‌కు చెందిన గిద్ద రాజు, తదితర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అక్కడే ఉన్న డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డిని కలిశారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు

నాగర్‌కర్నూల్ రూరల్: పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణ స్వామికి డీసీసీ అధ్యక్ష పదవి కోసం మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొండ మణెమ్మ దరఖాస్తు చేసుకుంది. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని ఆమె పేర్కొన్నారు.

వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న గిరిజన ఉద్యోగులు

అచ్చంపేట: గిరిజన ఉపాధ్యాయుల, డైలీ వైజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. రాములు డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్కర్ల సమస్యల కోసం సెప్టెంబర్ 12 నుంచి సమ్మె చేస్తున్న గిరిజన శాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థులకు భోజనం అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సీఆర్టీలకు మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేస్తూ నెల వారీగా జీతాలు ఇవ్వాలని కోరారు. ఇతర శాఖలో ఇచ్చిన మాదిరిగానే సీఆర్టీలకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, అర్హులైన సీఆర్టీలకు రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. ప్రభుత్వం జీఓ ప్రకారం మంజూరు చేసిన సీఆర్టీ 74 ఖాళీ పోస్టులో నూతనంగా 15 పోస్టులు భర్తీ చేయాలని, టీచర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ వెంటనే చేయాలన్నారు. ఎం లింగస్వామి, ప్రధాన కార్యదర్శి ఈ రామూలాల్, కోశాధికారి పాండు నాయక్, నరేష్, శంకర్, తిరుపతయ్య, ఆర్టీలు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బయన్న, కోశాధికారి చంద్రశేఖర్, డైలీ వర్కర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వర్కర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో పలు సంఘాల నాయకులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 31రోజులుగా నిరవధిక సమ్మెచేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వినూత్నమైన పద్ధతిలో ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే తమ హక్కులు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, భరత్ నాయక్, ఓం ప్రకాష్, రాములు, వెంకటేష్, పర్వతాలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తిమ్మాజిపేట/తెలకపల్లి: తిమ్మాజిపేట మండలంలోని చేగంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నాగిరెడ్డి తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ బొమ్మసాని నర్సింహ కుమారుడు లక్ష్మణ్(40) ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, రైతు బంధు మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోపిగౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ హుసేనీ, హన్మంతరావు, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నియోజకవర్గ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని మాధవస్వామి దేవాలయ ఆవరణలో సమావేశం అయ్యారు. ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బేబిని బీరయ్య, జిల్లా నాయకులు నాగమల్లయ్య హాజరయ్యారు. నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా గోపాల శేషయ్య, ఉపాధ్యక్షుడిగా ఓరె శేఖర్, పెద్ద ఉషాన్, గౌరవ అధ్యక్షుడిగా గంగొండ ఈదన్న, ప్రధాన కార్యదర్శిగా రాకొండ బీరయ్య, కోశాధికారిగా బింగి ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, సభ్యులుగా గోపాల ఎల్లయ్య, బాలపీరు, దేవేందర్‌లను ఎన్నుకున్నారు.

సీసీ రోడ్డుకు మరమ్మతు



వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌పై కుంగిన సీసీ రోడ్డుకు ఆదివారం వెల్దండ పోలీసుల ఆధ్వర్యంలో మరమ్మతు చేశారు. కల్వకుర్తి-హైదరాబాద్ ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు కుంగి పెద్ద గుంత ఏర్పడింది. వాహనదారులు గమనించికుండా వెళ్లడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పోలీసులు మిషన్ భగీరథ అధికారులకు సమస్యను వివరించారు. దీంతో కుంగిన సీసీరోడ్డుకు మరమ్మతు చేశారు.

దేశద్రోహం కేసు నమోదు చేయాలి

అచ్చంపేట రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో దళిత, బహుజన ప్రజా సంఘాల కూటమి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా కఠిన చట్టాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలయ్య, శ్రీశైలం, నారాయణ, రామస్వామి, మస్తాన్, మల్లికార్జున్, బృందావన్ తదితరులు పాల్గొన్నారు.

నిండిన చెరువులు, కుంటలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు అయా గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని అల్లాపూర్ పెద్ద చెరువు, ఎంగంపల్లి చౌటచెరువు, తాడూరు పెద్దచెరువు, ఐతోలు బుర్గులకుంట చెరువు, ఇంద్రకల్ నాగుల చెరువులతో కుంటలు పూర్తిగా నిండి 10 రోజులుగా దిగువకు నీరు వెళ్తున్నాయి. వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. చెరువు కుంటలు పూర్తి స్థాయిలో నిండడంతో యాసంగి పంటలకు బాగా దిగుబడి బాగా రావచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిండిన కొత్త చెరువు

అడవి పందుల నియంత్రణపై అవగాహన



తిమ్మాజిపేట: మండలంలోని గొరిటలో అడవి పందుల నియంత్రణపై ఆదివారం వనపర్తి వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు రైతులకు వివరించి అవగాహన కల్పించారు. వ్యవసాయ పంటలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రత్యేక పోస్టర్ ద్వారా రైతులకు సూచనలు చేశారు. పందుల నియంత్రణకు సంబంధించి భౌతిక, జీవ, రసాయన సాంకేతిక, జీవ ఆర్థిక పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు ఉషాశ్రీ, జానకీ, హిమబిందు, లేఖ్య, ఝాన్సిరాణి, అశ్విని, పలువురు రైతులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం



వెల్దండ: బీసీల పేరుతో కాంగ్రెస్ మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వానికే స్పష్టత లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు ఏకమై కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. పార్లమెంట్ బిల్లు పెట్టకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉండడంతో హైకోర్టు జీఓ 9ని రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ తీరుకు నిరసనగా ఈ నెల 14న బీసీ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా బందుకు పిలుపునిచ్చిందన్నారు. బీసీబంద్‌కు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. పార్టీ కార్యకర్తలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సింగిల్‌విండో డైరెక్టర్ నాగులు నాయక్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, రాజు, బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌నాయక్, ప్రసాద్, అశోక్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

శబరిలో దొంగతనంపై చర్య తీసుకోవాలి

అచ్చంపేట: శబరిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అయ్యప్ప సేవ సమితి అధ్యక్షుడు కపిలవాయి మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శబరిమలలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దొంగతనంపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి ఉపాధ్యక్షుడు బాదం రాజశేఖర్, మండికారి బాలాజీ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీది ద్వంద్వ వైఖరి

నాగర్‌కర్నూల్ రూరల్: బీసీ రిజర్వేషన్లపై బీజేపీది ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి పొదిలి రామయ్య ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ దామాషా ప్రకారం వెనకబడిన కులాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వం రిజర్వేషన్లు కలిపిస్తు చట్టబద్ధత కల్పించాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కాశన్న, సత్యనారాయణ, వెంకటేష్, మదు, విరేంద్ర, లక్ష్మయ్య, నరసింహ, ముర్తజా, వెంకటయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు



పెద్దకొత్తపల్లి: నాయినిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రైతులు వ్యవసాయ కూలీలు యాసంగి వ్యవసాయ పనులల్లో బిజీగా ఉండటంతో మైసమ్మ జాతరకు 5000 మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు లేకపోవడంతో జాతరలోని తినుబండరాలు, ఇతర దుకాణాలు గిరాకులు లేక వెలవెలబోయాయి.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



తాడూరు: ప్రజా సమస్యలపై నిరంతర పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భరత్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగదేవపల్లి గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బులకు ఓట్లు అమ్ముకోకుండా నిజాయితీ నిస్వార్థ పరులను ఎన్నుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇతర పార్టీల నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాములు, లక్ష్మణ్, వెంకటయ్య, కృష్ణయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాముల గ్రామానికి చెందిన నీడిగొండ సిద్ధార్థ, పగిడాల మహేష్, సాతాపురం వంశీలు దళితుల భూములలో వేసుకున్న పంటలను తొలగించేందుకు యత్నించారు. బీసీలు కొంత మంది దళితులపై దాడులు చేసి గాయపర్చడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. దీంతో ఆదివారం నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ పెద్దకారుపాముల గ్రామానికి చేరుకొని పొలం వద్ద విచారణ చేపట్టారు. సర్వే నెం. 315, 316లో ఎస్సీలకు ప్రభుత్వం భూములను కేటాయించినట్లు గుర్తించారు. ఈ భూముల్లో బీసీ కులానికి చెందిన కొంత మంది వ్యక్తులు ఆక్రమించుకొని పంటలు సాగుచేసుకుంటున్నారని డీఎస్పీ తెలిపారు. తమ పొలం తామే సాగుచేసుకుంటామని ఎస్సీలు వెళ్లగా కర్రలతో దాడులు చేసి గాయపర్చారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైన దౌర్జన్యంగా భూములు లాక్కొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ సీఐ మహేష్, పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాస్

పాత పాలకవర్గ హయాంలోనే భూకబ్జాలు

కల్వకుర్తి టౌన్: పాత పాలకవర్గ హయాంలోనే భూకబ్జాలు జరిగాయని మాజీ సర్పంచ్‌లు ఆనంద్‌కుమార్, సుదర్శన్ రెడ్డిలు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాత పాలకవర్గంలో ఉన్న మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, మాజీ వైస్ చైర్మన్ షాహెద్‌లు మున్సిపాలిటీలో పలు కబ్జాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సబ్‌రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై భూకబ్జాలకు చేశారన్నారు. లేఅవట్లలో రూ.లక్షలు తీసుకొని ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు. గత పాలకవర్గ కాలపరిమితి కాలంలో ఉద్యోగులకు జీతాల పేరుతో ఓ కాంట్రాక్టర్‌కు నియమించి నెలకు రూ.1.5లక్షలు అప్పనంగా దోచుకున్నారన్నారు. భూకబ్జాలు, ఇతర అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటాలు చేస్తామని, వారి భాగోతాలను ఒక్కొక్కటి బయట పెడతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు షానవాజ్ ఖాన్, చిన్నరాం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీను, ఎజాస్, హేన్మానాయక్, వెంకటేష్, సురేష్, రేష్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌లు ఆనంద్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి